# జీబీ లింక్‌పై ఉత్తరాలు రాస్తే ఎందుకు విడుదల చేయలె?

- ఇప్పటివరకు ఎందుకు దాచిపెట్టారు
- ఏపీ సీఎం చంద్రబాబు నిధుల కోసం లేఖలు రాస్తున్నరు
- అయినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు?
- మంత్రి ఉత్తమ్‌ది తప్పుడు ప్రచారం: మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్‌పై రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీబీ లింక్‌పై ఉత్తరాలు రాస్తే ముందే ఎందుకు విడుదల చేయలేదని నిలదీశారు. మంత్రి వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా హరీశ్‌రావు మండిపడ్డారు. తాను పత్రికా సమావేశం పెట్టిన తర్వాతనైనా మేల్కొని 22వ తేదీతో లెటర్ రాసి, ఈరోజు విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. 22నే నిజంగా లేఖ రాసి ఉంటే, ఆ రోజే మీడియాకు విడుదల చేయకుండా ఈరోజు వరకు ఎందుకు దాచిపెట్టారని నిలదీశారు. గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం విషయంలో ఏపీ సీఎం 2024 నవంబర్ 15న ఒక లేఖ, నిధుల కోసం 2024 డిసెంబర్ 31న మరో లేఖ రాశారని, మరి ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదని, ఉత్తరాలు ఎందుకు రాయలేదని, 22నే ఉత్తరాలు రాస్తే ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. జీబీ లింక్ ప్రాజెక్టుపై తన వ్యాఖ్యలను వక్రీకరించారని అభ్యంతరం తెలిపారు. 200 టీఎంసీలు తీసుకుపోతున్నారని తాను ఎక్కడ అనలేదని, జలాలను తరలించుకుపోయేందుకు ప్రాజెక్టు రూపకల్పన చేస్తుంటే ప్రభుత్వం మౌనం వహిసున్నదని మాత్రమే ప్రశ్నించానని వివరించారు. తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం తాను ప్రశ్నిస్తే గాని, ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడదనడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని చురకలంటించారు. 512: 299 నిష్పత్తిలో ఒప్పందం ఒకే ఏడాదికి జరిగిన విషయం మంత్రి విడుదల చేసిన డాక్యుమెంట్లలోనే స్పష్టంగా ఉందని, మంత్రి హోదాలో ఉండి ఎందుకు అబద్ధాలు చెబుతున్నారని నిప్పులు చెరిగారు. ఒకవేళ అదే ఒప్పందం ఉంటే, సెక్షన్ 3 ప్రకారం.. నీటి పంపకాలు అంశం ఎందుకు ఉత్పన్నమైందని ప్రశ్నించారు. ట్రిబ్యునల్ సమావేశానికి మంత్రి హోదాలో హాజరైన మొదటి వ్యక్తి తానొక్కడినేనని ఉత్తమ్ మరో అబద్ధం చెబుతున్నారని, 2016లోనే సీఎం హోదాలో కేసీఆర్, ఇరిగేషన్ మంత్రిగా తాను ట్రిబ్యునల్ మీటింగ్‌లో పాల్గొని తెలంగాణ పక్షాన కొట్లాడామని, మీటింగ్ మినిట్స్‌లో ఆ వివరాలు ఉంటాయని, వాటిని చూసుకోవాలని చురకలంటించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ విషయంలోనూ మంత్రి ఉత్తమ్ అబద్ధాలు చెప్పారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును వ్యతిరేకించలేదనేది పచ్చి అబద్ధమని స్పష్టం చేశారు. ఏపీ సీఎం జగన్ అసెంబ్లీలో ప్రకటించిన నాటి నుంచే వ్యతిరేకిస్తూ కేఆర్‌ఎంబీకి, కేంద్రానికి, జల్‌శక్తి శాఖ మంత్రి షెకావత్‌కు పుంఖానుపుంఖాలుగా లేఖలు రాశామని గుర్తుచేశారు. తమ ఒత్తిడితోనే ప్రాజెక్టు పనులు చేయవద్దని జల్‌శక్తి మంత్రి కూడా ఏపీకి లేఖ రాశారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఎన్జీటీకి వెళ్లి స్టే తీసుకొచ్చిందని, సెకండ్ అపెక్స్ కౌన్సిల్‌లో కూడా వ్యతిరేకంగా మాట్లాడామని, మీటింగ్ మినిట్స్‌లో అవికూడా ఉంటాయని చూసుకోవాలని మంత్రికి సూచించారు. ఇప్పటికీ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఆగి ఉన్నాయంటే అది బీఆర్‌ఎస్ చేసిన కృషి వల్లనే అన్నది దాచేస్తే దాగని సత్యమని తెలిపారు. తాను మాట్లాడింది గోదావరి జలాల్లో జరుగుతున్న అన్యాయం గురించైతే, మంత్రి ఆ విషయం మాట్లాడకుండా ఏవేవో మాట్లాడి, విషయాన్ని పక్కదోవపట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. మంత్రి చెప్పిన అబద్ధాలకు పూర్తి వాస్తవాలతో పత్రికా సమావేశం నిర్వహించి అసత్య ప్రచారాన్ని పటాపంచలు చేస్తానని ఎక్స్ వేదికగా హరీశ్ వెల్లడించారు.

### కేంద్రానికి లేఖలు రాశాం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ఏపీ ప్రభుత్వం చేపడుతున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తమ ప్రభుత్వం అలర్ట్‌గానే ఉన్నదని సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఏపీ ప్రతిపాదిత ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిందని, లేఖలు కూడా రాశామని వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలను ఖండించారు. గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకానికి సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రానికి ప్రతిపాదనలు మాత్రమే సమర్పించారని స్పష్టం చేశారు. కేంద్ర జల్‌శక్తి శాఖ, ఆర్థికశాఖ మంత్రులకు రాసిన లేఖలను ఈ సందర్భంగా మీడియాకు మంత్రి ఉత్తమ్ విడుదల చేశారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో పార్టీ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, విప్లవ్‌కుమార్, గట్టు రామచందర్‌రావు, కురవ విజయ్

# జల దోపిడీపై ఎందుకీ మౌనం?

- బాబుకు రేవంత్ గురుదక్షిణ చెల్లిస్తున్నరా?
- తెలంగాణకు నీటి కేటాయింపులపై సీఎం ఎందుకు మాట్లాడరు?
- ఏపీ, కర్ణాటక అక్రమ ప్రాజెక్టులు కడుతున్నా కేంద్ర సంస్థలకు ఎందుకు లేఖలు రాయరు?
- నీళ్ల విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నది
- ఏపీకి కొమ్ముకాసి 3 నెలల జైలు శిక్షపడ్డ మాజీ సీఎస్‌ను సలహాదారుగా ఎందుకు పెట్టారు?
- మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీత

**గోదావరి నదీ జలాలను పెద్దఎత్తున తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రయత్నిస్తున్నది. తుంగభద్ర నదిపై ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టులు కట్టి పెద్దఎత్తున నీళ్లు తరలించుకుపోయే ప్రయత్నాలు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి, అధికారుల అలసత్వం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉన్నది. – హరీశ్‌రావు**

**సమయం, సందర్భం వచ్చినప్పుడు రాజకీయాలు పక్కనపెట్టి, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకోవాలి. ఇతర రాష్ట్రాలను చూసి నేర్చుకోవాలి. మన రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నీటి వాటాలు ముఖ్యం. ఆ నీళ్లు సాధించుకోవడానికి, అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కండ్లు తెరిచి, యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. –హరీశ్‌రావు**

**ఇవాళ ఏపీ ప్రభుత్వం ఏ అనుమతీ లేకుండా 200 టీఎంసీల నీటిని గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా తీసుకొని పోతున్నది. ఇంత జరుగుతుంటే ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి ఏం చేస్తున్నరు? ఏపీ ప్రాజెక్టులను ఆపండని కనీసం ఉత్తరం కూడా రాయలేదు. – హరీశ్‌రావు**

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నోరుమెదపడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. పొరుగు రాష్ట్రాలు చేస్తున్న జల దోపిడీపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణకు రావాల్సిన నీటివాటాను ఏపీ సీఎం చంద్రబాబుకు రేవంత్ గురుదక్షిణగా చెల్లిస్తున్నరా? అని నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పెండింగ్‌లో ఉన్నా, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు అక్రమ ప్రాజెక్టులు కడుతున్నా కాంగ్రెస్ సర్కారు కేంద్రానికి ఎందుకు లేఖలు రాయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ నినాదమే నీళ్లు, నిధులు, నియామకాలని, నీళ్ల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

### బనకచర్ల ద్వారా 200 టీఎంసీలు

ఏపీ ప్రభుత్వం ఇప్పటికే పోలవరం రైట్ కెనాల్‌ను మూడింతలు పెంచిందని, 200 టీఎంసీల నీటిని బనకచర్ల ద్వారా పెన్నా బేసిన్‌కు యుద్ధ ప్రాతిపదికన తరలించేందుకు ముందుకుపోతున్నా రేవంత్ సర్కారుకు చీమ కుట్టినట్టయినా లేదని హరీశ్‌రావు విమర్శించారు. 'తెలంగాణకు సంబంధించి సీతారామసాగర్, సమ్మక్కసాగర్, కాళేశ్వరంలో 3వ టీఎంసీ, అంబేద్కర్ వార్ధా పెండింగులో ఉన్నాయి. ఈ నాలుగు ప్రాజెక్టులకు క్లియరెన్సులు సాధించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. కొత్త ప్రాజెక్టు చేపట్టాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్ క్లియరెన్స్, నీటి కేటాయింపు, అంతర్రాష్ట్ర క్లియరెన్స్ కావాలి. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం గోదావరి, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుల అనుమతి కావాలి. అపెక్స్ కౌన్సిల్ అనుమతి కావాలి. కానీ, ఇవాళ ఏపీ ప్రభుత్వం వీటిలో ఏ అనుమతి లేకుండా 200 టీఎంసీల నీటిని గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా తీసుకొని పోతున్నది. ఇంత జరుగుతుంటే సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి ఏం చేస్తున్నరు? ఏపీ ప్రాజెక్టులను ఆపండని కనీసం ఉత్తరం కూడా రాయలేదు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### కేంద్ర మంత్రికి చంద్రబాబు లేఖలు

తాము కొత్త ప్రాజెక్టులు కట్టుకుంటున్నామని, నిధులివ్వండని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు రెండు లేఖలు రాశారని చెప్పారు. ఏడీబీ నుంచి 40 వేల కోట్ల నిధులిప్పిస్తామని కేంద్రం మాట ఇచ్చిందని గుర్తుచేశారు. బాబు రాసిన లేఖలను మీడియాకు చూపించారు. 'ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిద్రపోతున్నదా? సీఎం స్వయంగా వెళ్లి కేంద్ర మంత్రులను, ప్రధానిని కలిసి ఈ ప్రాజెక్టులను ఆపాలని అడిగే సోయి లేదా? సలహాదారులు, అధికారులు ఏం చేస్తున్నట్టు?' అని హరీశ్‌రావు నిలదీశారు.

### సలహాదారుగా ఇంకెవరూ దొరకలేదా?

ఏపీ అక్రమంగా కడుతున్న రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు మీద, సుప్రీంకోర్టులో తప్పుడు వాదనలు వినిపించిన ఆదిత్యనాథ్ దాస్‌కు మూడు నెలల జైలు శిక్ష వేసిందని, ఒక సీఎస్‌కు మూడు నెలల జైలు శిక్ష పడ్డదంటే, ఒక్క ఆదిత్యనాథ్‌దాస్‌కేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఏపీ ప్రయోజనాల కోసం పనిచేసిన ఇలాంటి అధికారిని తెలంగాణ ప్రభుత్వం నీటి పారుదల శాఖకు సలహాదారుగా పెట్టుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'తెలంగాణ ప్రయోజనాలకు గండికొట్టి, తెలంగాణ హక్కులను కాలరాసే అధికారి ఎవరి కోసం పనిచేస్తరు? మీకు సలహాదారుగా పెట్టుకోవడానికి ఇంకెవరూ దొరకలేదా? మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి? సీఎం ఏమైనా గురుదక్షిణ కింద చెల్లించుకుంటున్నరా? మన రాష్ట్ర ప్రయోజనాలు మీకు పట్టవా? ఇది అత్యంత బాధాకరం' అని ఆవేదన వ్యక్తంచేశారు.

### రెండు రాష్ట్రాల నీటి చౌర్యం

తుంగభద్ర నీళ్లను తరలించేందుకు అటు కర్ణాటక, ఇటు ఏపీ కాల్వలు తవ్వుకుంటున్నాయని, తద్వారా రాష్ట్రంలోని కల్వకుర్తి, డిండి ఎత్తిపోతలు, సాగర్ ఆయకట్టు నీళ్లందక దెబ్బతినే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. 'ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నది? 2017లో ఏపీ ప్రభుత్వం గోదావరి నుంచి నీళ్లు తరలించే ప్రయత్నం చేస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆపింది. గోదావరి, కృష్ణా బేసిన్‌లో ఏపీ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ, ఎప్పటికప్పుడు లేఖలు రాశాం. ఆపగలిగాం. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ విషయానికి వస్తే.. బీఆర్‌ఎస్, కేసీఆర్ ఎంతో ప్రయత్నం చేసి సెక్షన్-3 సాధించారు. దీని కింద కృష్ణా, గోదావరి జలాలను పున:పంపిణీ చేయాలని అప్పటి కేంద్ర మంత్రి ఉమాభారతికి అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాశారు. సుప్రీంకోర్టులో చివరిదాకా పోరాడి విజయం సాధించాం. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేవియెట్ వేయకపోవడంతో ఏపీ ప్రభుత్వం సెక్షన్-3 మీద సుప్రీంకోర్టులో కేసు వేసింది. పదేండ్లు మేం కష్టపడి సెక్షన్- 3 సాధిస్తే మీరు దాన్ని కాపాడాలి కదా? వాదనలు వినిపించాలి కదా? రెండు రాష్ట్రాల మధ్య నదీ పరీవాహక ప్రాంతాల ప్రకారం నీళ్లు సాధించుకోవాలి కదా? దీనిపై దృష్టిపెట్టి కేంద్రానికి, అన్ని ఫోరమ్స్‌కు లేఖలు రాయాలని, అవసరమైతే సుప్రీంకోర్టులో పోరాడి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. మొద్దు నిద్రపోతున్న ప్రభుత్వాన్ని తట్టి లేపడానికే ప్రెస్‌మీట్ పెట్టినం' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

### రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం

'మేం రాష్ట్ర ప్రయోజనాల కోసం సూచనలిస్తున్నాం. మీరేమో పట్టించుకోవడం లేదు. మీరు ఢిల్లీ యాత్రల్లో బిజీగా ఉన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడే ప్రయత్నం చేయండి. మీకు నిజాయితీ ఉంటే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి. మేం వచ్చి మీకు విలువైన సూచనలు, సలహాలిస్తాం. అర్థం కాకపోతే అడగండి, చెప్పడానికి సిద్ధంగా ఉన్నాం. మీరు చిల్లర రాజకీయాలు మానుకోండి, తిట్లు బూతులు వద్దు, మేం తిట్టలేక కాదు, బూతులు మాట్లాడలేక కాదు' అని హరీశ్‌రావు చెప్పారు. సమావేశంలో పార్టీ నేతలు గట్టు రామచందర్‌రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్, దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, విప్లవ్‌కుమార్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, కురవ విజయ్ పాల్గొన్నారు.

### మంత్రి ఉత్తమ్ ఫెయిల్

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫెయిల్ అయ్యారని హరీశ్‌రావు విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబు ప్రాజెక్టుకు నిధులు కావాలని కేంద్రమంత్రికి నవంబర్‌లో ఉత్తరం రాస్తే.. దానిపై ఇప్పటివరకు మంత్రి ఉత్తమ్ ఎందుకు స్పందించలేదని నిలదీశారు. అక్రమ ప్రాజెక్టుపై అభ్యంతరం తెలుపకుండా ఏమి చేస్తున్నారు? ఉత్తరం రాయలేనంత బిజీగా ఉన్నరా? అని ప్రశ్నించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇచ్చే ప్రయత్నం చేస్తుంటే, రేవంత్ సర్కారు ఏమి చేస్తున్నట్టు.. దొంగలు పడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగినట్టు.. ఇంకెప్పుడు రాస్తరు? అని నిలదీశారు. ఒకవేళ రాస్తే ఆ ఉత్తరం చూపించాలని డిమాండ్ చేశారు.

### 'మహా' పెట్టుబడుల్లో పదో వంతే!

- దావోస్‌లో మహారాష్ట్రకు భారీగా పెట్టుబడులు
- తెలంగాణ ఎంవోయూల్లో స్థానిక కంపెనీలవే అధికం
- సోషల్ మీడియాలో విమర్శలు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో తాజాగా ముగిసిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సు సందర్భంగా తెలంగాణకు 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు రేవంత్ సర్కారు చేసిన ప్రకటనలపై సోషల్ మీడియాలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్రకు ఏకంగా 16 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటితో పోల్చితే తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు 10% మాత్రమేనని పలువురు విమర్శిస్తున్నారు. పైగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన కంపెనీల్లో సింహభాగం దేశీయ కంపెనీలే ఉన్నాయని, ముఖ్యంగా హైదరాబాద్‌కు చెందిన 3 కంపెనీలతోనే రేవంత్ ప్రభుత్వం 25 వేల కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నదని గుర్తు చేస్తున్నారు. అంతర్జాతీయ కంపెనీల్లో అత్యధికం మహారాష్ట్రకే క్యూ కట్టాయని, క్రాస్ రెయిల్, బ్రూక్ ఫీల్డ్, బ్లాక్ స్టోన్, సుమిటోమో, బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ లాంటి ప్రఖ్యాత సంస్థలు ఆ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకే మొగ్గు చూపాయని స్పష్టం చేస్తున్నారు. తెలంగాణకు పెట్టుబడులను రాబట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరుడు దావోస్‌లో కుదుర్చుకున్న ఒప్పందాల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని, ఈ ఏడాది కుదిరిన ఒప్పందాలపై సంబరపడాల్సిన అవసరం లేదని కామెంట్లు చేస్తున్నారు.

### నేటి నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తేతెలంగాణ) : ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండాగా సంగారెడ్డిలో నేటి నుంచి 28 వరకు సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలు జరుగనున్నాయి. ముఖ్య అతిథులుగా పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆహ్వానసంఘం చైర్మన్ చుక్క రాములు హాజరవుతారు. 26 నుంచి 28 వరకు సంగారెడ్డిలోని గోకుల్ గార్డెన్‌లో ప్రతినిధుల సభ జరుగుతుంది.

# పెట్టుబడులపై రేవంత్ కట్టుకథలు

- దావోస్ టూర్‌ను బోగస్ చేశారు
- నిరుడు రూ.40 వేల కోట్లని తప్పుడు లెక్కలు
- ఇప్పుడు 1.78 లక్షల కోట్లు అంటూ ప్రగల్భాలు
- శ్వేతపత్రం విడుదల చేయాలి
- ఎండీసీ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): సింగపూర్, దావోస్ పెట్టుబడులపై సీఎం రేవంత్‌రెడ్డి కట్టుకథలు చెబుతున్నారని మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎండీసీ) మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దావోస్ టూర్‌ను బోగస్‌గా మార్చి పచ్చి అబద్ధాలు చెబుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. మన దేశం, మన రాష్ట్రానికి చెందిన కంపెనీలతో విదేశాలకు వెళ్లి ఒప్పందాలు చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. గొప్పల కోసమే తప్పుడు లెక్కలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో దావోస్ పెట్టుబడులపై రేవంత్, ఉత్తమ్, భట్టి మాట్లాడిన వీడియోలను చూపుతూ కాంగ్రెస్ సర్కారు వైఖరిని కడిగిపారేశారు. 'నాడు పెట్టుబడులతో ఒరిగేదేమీ ఉండదని.. కంపెనీలకే లాభం తప్ప, ప్రజలకు మేలేమీ లేదని చెప్పిన రేవంత్.. ఇప్పుడు రూ.1.78లక్షల కోట్ల పెట్టుబడులంటూ ఊదరగొడుతున్నారు' అని దుయ్యబట్టారు. గతంలో ఇస్టిండియా కంపెనీతో పోల్చిన మేఘాతో ఇప్పుడు ఒప్పందం ఎందుకు చేసుకున్నారు? అది యూరోప్ కంపెనీగా భావించి అక్కడే అగ్రిమెంట్ చేసుకున్నారా? అంటూ ఎద్దేవాచేశారు. దావోస్ పెట్టుబడులతో లాభం లేదని పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్, ఎక్స్‌పేషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ అని భట్టి చెప్పిన విషయాలను గుర్తుచేశారు. నిరుడు కుదుర్చుకున్న 40 వేల కోట్ల పెట్టుబడుల్లో ఇప్పటి వరకు ఏ ఒక్క రూపాయి రాలేదని పేర్కొన్నారు. దావోస్‌లో లేని సన్ సంస్థ ఎండీతో అగ్రిమెంట్ చేసుకున్నామని సీఎం పచ్చి అబద్ధం చెప్పారని, సీఎం ఇలా వ్యవహరించవచ్చా? అని నిలదీశారు. సన్ ఎండీ దిలీప్‌సంఘ్వీకి బదులు వేరే వ్యక్తితో సీఎం దిగిన ఫొటోలను ప్రధాన పత్రికలో ప్రచురితం చేయడం సబబు కాదన్నారు.

### పాకిస్థాన్ సంస్థకు మూసీ కట్టబెట్టే కుట్ర..

పాకిస్థాన్‌కు చెందిన సంస్థ మెయిన్ హార్ట్‌కు మూసీ సుందరీకరణ ప్రాజెక్టును కట్టబెట్టేందుకు సీఎం కుట్రలు చేస్తున్నారని క్రిశాంక్ ఆరోపించారు. ఆ సంస్థ ఎండీతో సమావేశం కావడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. బోగస్ కంపెనీలతో అగ్రిమెంట్ల పేరిట ప్రగల్భాలు పలుకుతున్న సీఎం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మాటలు కట్టిపెట్టి వాస్తవాలు చెప్పాలని హితవు పలికారు.

### విద్యుత్తు పాలసీ లేకుండా పెట్టుబడులా?

ఇప్పటివరకు విద్యుత్తు పాలసీ రూపొందించలేదని ఆ శాఖ మంత్రి భట్టి విక్రమార్క చెప్తుంటే సీఎం మాత్రం పంప్డ్ స్టోరేజీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నామని అసత్యాలు వల్లెవేస్తున్నారని క్రిశాంక్ ధ్వజమెత్తారు. రాష్ట్రానికి డాటా సెంటర్లు వస్తున్నాయంటే కేసీఆర్ పాలనే కారణమని చెప్పారు. కానీ, రేవంత్ ఆయన పేరు పలికేందుకు నామోషిగా భావించడం బాధాకరమని పేర్కొన్నారు.

# పరువు తీస్తున్న సీఎం భాష

- దావోస్‌లో పీవీకి సిస్టమ్ ఆన్, ఆఫ్ చేయరాదనడంతో రచ్చ
- కేటీఆర్‌ను 'డాటా ఎంట్రీ ఆపరేటర్'తో పోలుస్తూ వ్యాఖ్యలు
- కోల్‌కతాను చెత్త సిటీ అనడంతో జాతీయ స్థాయి విమర్శలు
- కులగణనలో పాల్గొనకుంటే సామాజిక బహిష్కరణ చేయండి
- జర్నలిస్టులను ఉన్మాదులుగా పోలుస్తూ కించపరిచే వ్యాఖ్యలు
- బాహాటంగా నోరు జారుతున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన, ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి వాస్తవ పరిస్థితుల్లో చేస్తున్న వ్యాఖ్యలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రిగా హుందాగా వ్యవహరించాల్సిన వ్యక్తి నోరు జారుతూ అభాసుపాలు అవుతున్నారని రాజకీయవర్గాలు మండిపడుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కూడా రేవంత్ నవ్వుల పాలవుతున్నారని ఎద్దేవా చేస్తున్నారు. దావోస్‌లో ఓ జాతీయ మీడియా చానల్‌తో సీఎం రేవంరెడ్డి మాట్లాడుతూ పాలసీ మేకర్‌గా, నాయకుడిగా తనకు అన్ని విషయాలు తెలియాల్సిన అవసరంలేదని స్పష్టంచేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు అసలు కంప్యూటర్ ఆన్, ఆఫ్ చేయడం తెలియదని చెప్పారు. ఇవే వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పీవీ ఆ కాలంలోనే సాఫ్ట్‌వేర్ కోడింగ్ నేర్చుకున్నారని ఆ మేరకు పీవీ పాత ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన నెటిజన్లు రేవంత్‌పై విరుచుకుపడ్డారు. ఇదే ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను 'డాటా ఎంట్రీ ఆపరేటర్' అంటూ రేవంత్ చులకన చేసి మాట్లాడారు. సాఫ్ట్‌వేర్, ఐటీ ఉద్యోగులకు కేవలం వర్కర్స్ మైండ్‌సెట్ ఉంటుందని రేవంత్ చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

### జాతీయ స్థాయిలో విమర్శలు

హైదరాబాద్‌లో ఓ సభలో దేశంలోని నగరాల కాలుష్యంపై రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచలోనే 'చెత్త నగరం' విభాగంలో కోల్‌కతా మొదటి స్థానంలో నిలుస్తుందని వ్యాఖ్యానించారు. తృణమూల్ కాంగ్రెస్ రేవంత్ వ్యాఖ్యలను తప్పుబట్టింది. సీఎం రేవంత్ కోల్‌కతాను సందర్శించాలని సూచించారు. నిరాధారమైన వాదనలపై స్పందించాల్సిన అవసరం లేదని రేవంత్ వ్యాఖ్యలను కొట్టిపారేశారు. ఢిల్లీ నివాసయోగ్యమైన నగరం కాదని, చెన్నైలో తరచూ వరదలు వస్తాయని, బెంగళూరులో ట్రాఫిక్ సమస్య ఎక్కువ అని, ముంబైలో భారీ వర్షాలు కురుస్తాయంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యమంత్రిగా హుందాగా వ్యవహరించాల్సిన రేవంత్‌రెడ్డి నోరు జారుతూ తెలంగాణ పరువు తీస్తున్నారని మండిపడుతున్నాయి.

### జర్నలిస్టులపైనా అదే ధోరణి!

రాజకీయ పార్టీలు పెట్టిన పత్రికల్లో పని చేస్తున్న జర్నలిస్టులు ఉన్మాదులుగా పని చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలకు అడ్డుపడుతున్నారంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జర్నలిస్టు సంఘాల నేతలు తప్పుబట్టారు. హైదరాబాద్ నగరానికి, రాష్ట్రానికి మూడు వైపుల సముద్రం ఉందంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలు సామాన్యులను సైతం విస్మయానికి గురి చేశాయి. బీసీ కులగణనలో పాల్గొనని వారిని సామాజిక బహిష్కరణ చేయాలన్న రేవంత్ వ్యాఖ్యలపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు దొరకుతాయంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు ట్రోలింగ్‌కు గురయ్యాయి. మొత్తానికి రేవంత్‌రెడ్డి మాట్లాడే భాషపట్ల సోషల్ మీడియాలో రాజకీయ, మీడియా, సోషల్ మీడియా వర్గాల్లో విమర్శలకు దారితీస్తున్నది.

### ముఖ్యమంత్రికి స్వాగతం పలకని మంత్రులు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన ముగిసింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్ చేరుకున్న ఆయనకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికాయి. కానీ, మంత్రులెవరూ ఆయనకు స్వాగతం పలికేందుకు ఆసక్తి చూపించకపోవటం గమనార్హం. దాదాపు 10 మంది మంత్రులు హైదరాబాద్‌లోనే ఉన్నప్పటికీ, ఎయిర్‌పోర్టు వరకు ఎదురువెళ్లి ముఖ్యమంత్రికి స్వాగతం పలకటానికి వారు సుముఖత చూపకపోవటం చర్చనీయాంశమైంది. ఈనెల 16న హైదరాబాద్ నుంచి బయలుదేరిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం 17 నుంచి 19వ తేదీ వరకు సింగపూర్‌లో పర్యటించింది. అనంతరం దావోస్‌కు చేరుకుని అక్కడ మరో మూడు రోజుల పాటు డబ్ల్యూఈఎఫ్ సమావేశంలో పాల్గొన్నది. విదేశీ పర్యటన విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగివచ్చిన సీఎంకు ఆయన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కాగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇంకా దావోస్‌లోనే ఉన్నారు.

నల్లగొండలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్, సునీత

## రేవంత్ తీరుతో తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌కు దెబ్బ

- దావోస్‌లో రేవంత్ వ్యాఖ్యలు అభ్యంతరకరం
- నల్లగొండలో జగదీశ్‌రెడ్డి ఫైర్

నల్లగొండ ప్రతినిధి, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : దావోస్ వంటి అంతర్జాతీయ వేదికలపై సీఎం రేవంత్ చిల్లర చేష్టలు, చిల్లర మాటలతో తెలంగాణతో పాటు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీశారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. రేవంత్ వ్యాఖ్యలు ఐటీ రంగంతోపాటు అందులో పనిచేసే ఉద్యోగులను చులకన చేసేలా ఉన్నట్టు తెలిపారు. నల్లగొండలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. నల్లగొండలో ఈ నెల 28న బీఆర్‌ఎస్ పార్టీ తలపెట్టిన రైతు మహాధర్నాకు ప్రభుత్వం చేతిలో మోసపోయిన రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలోమాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, సునీత, గాదరి కిశోర్, భాస్కర్‌రావు, లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, బూడిద భిక్షమయ్య, రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ కృషితోనే 60 వేల కోట్ల పెట్టుబడి

- కాంగ్రెస్ కొత్తగా సాధించిందేమీ లేదు
- రాష్ట్ర టెక్నాలజీస్ సర్వీసెస్ సంస్థ మాజీ చైర్మన్ జగన్మోహన్‌రావు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : దావోస్ వేదికగా తాము సాధించుకొచ్చామని కాంగ్రెస్ చెబుతున్న అమెజాన్ రూ.60 వేల కోట్ల డాటా సెంటర్ పెట్టుబడులకు 2020లోనే బీజం పడినట్టు రాష్ట్ర టెక్నాలజీస్ సర్వీసెస్ సంస్థ మాజీ చైర్మన్ పాటిమీది జగన్మోహన్‌రావు తెలిపారు. ఈ పెట్టుబడులు సాధించడంలో కాంగ్రెస్ కృషి ఏమీ లేదని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1.70 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని చెబుతున్నదని, కానీ 2020 లో నాటి సీఎం కేసీఆర్ హయాంలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అమెజాన్ డాటా సెంటర్ ఏర్పాటుకు చొరవ చూపినట్టు తెలిపారు. తెలంగాణలో కంపెనీ ఏర్పాటుతో కలిగే లాభాలను కంపెనీ ప్రతినిధులకు వివరించి చెన్నై, ముంబై, నొయిడా, అహ్మదాబాద్, గుర్‌గావ్‌లకు తరలిపోకుండా కేటీఆర్ కృషి చేసినట్టు గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ హయాంలోనే మీర్‌ఖాన్‌పేటలో 48 ఎకరాల్లో 4 వేల మంది ఉద్యోగులతో అమెజాన్ డాటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటుచేసిందని, అప్పుడే మూడు నుంచి నాలుగేండ్లలో మరో డాటా సెంటర్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు.

## తెలంగాణ కంపెనీలతో దావోస్‌లో ఒప్పందాలా?

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విస్మయం**

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ కంపెనీలతో దావోస్‌లో ఒప్పందాలు చేసుకున్నదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ డైరీ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలోని వ్యాపారవేత్తలను దావోస్‌కు తీసుకెళ్లి అక్కడి నుంచి పెట్టుబడులు వస్తున్నట్టు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అంబేద్కర్, కర్పూరీ ఠాకూర్, అటల్ బిహారీ వాజ్‌పేయి, జయప్రకాశ్‌నారాయణ్, మహాత్మాగాంధీ స్ఫూర్తితో బీజేపీ పని చేస్తున్నదని తెలిపారు. అంబేద్కర్‌ను ఎన్నికల్లో ఓడించి అవమానించిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాప్రభుత్వాలను కూల్చివేసి, పత్రికా స్వేచ్ఛను హరించివేసిందని మండిపడ్డారు. రాజ్యాంగం గురించి అవగాహన లేని, రాజ్యాంగం చదవని వ్యక్తి రాహుల్ గాంధీకి రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు.